క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం



పెనమలూరు: తాడిగడప గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 100 మందికి సేవలు అందించారు. ఘంటసాల పర్ణశాల ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో తాడిగడప గ్రామం కర్మెల్ ప్రార్థనా మందిరం ఆవరణలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ శశాంక్ రోగులకు బీపీ, షుగర్, జలుబు, దగ్గు, మోకాళ్ల నొప్పులు, దీర్ఘకాల వ్యాధులపై పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు రోగులకు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్లు పీఎస్.రాజు, వెంకటరత్నం, నిర్వాహకులు కిరణ్, సుకన్య, బిందు, చక్రధర్, ప్రదీప్, నిఖిల్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

23న హుండీల లెక్కింపు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈ నెల 23న హుండీల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. ప్రియాంక తెలిపారు. ఉదయం 9.30 గంటలకు దేవదాయశాఖాధికారి పర్యవేక్షణలో భక్తులు అమ్మవార్లకు కానుకల రూపంలో హుండీల ద్వారా సమర్పించిన ఆదాయాన్ని లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

కొబ్బరి చెక్కల వేలంపాట

పేరంటాలమ్మ ఆలయంలో ఈ నెల 23న ఉదయం 10 గంటలకు కొబ్బరి చెక్కలు పోగు చేసుకునే లైసెన్స్ హక్కునకు సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ప్రియాంక తెలిపారు. భక్తులు ఆలయంలో సమర్పించే కొబ్బరి చెక్కలను రెండు సంవత్సరాల కాలపరిమితికి గానూ పోగు చేసుకునేందుకు ఈ వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేవదాయశాఖ ఉన్నతాధికారి పర్యవేక్షణలో జరిగే ఈ వేలంపాటలో ఆసక్తిగల వారు పాల్గొనాలని కోరారు.

రేపటి నుంచి పురాణ ప్రవచనాలు



కంకిపాడు: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కంకిపాడులోని శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో ఈ నెల 17 నుంచి 26వ తేదీ వరకూ పురాణ ప్రవచనాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు బృందావనం మురళీధర్ తెలిపారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో ఆదివారం పురాణ ప్రవచనాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. మురళీధర్ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థాన పౌరాణిక శిరోమణి కోలా నాగగంగాధరరావు ప్రవచనాలు చెబుతారన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అగ్నిహోత్రం హరిబాబు, పురాణం లీలా ప్రసాద్, తంబాబత్తుల శేషుబాబు, జి.భార్గవి, గుండెబోయిన రాము, ఎం.సాయినాగమల్లేశ్వరి, ఎం.రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఫాదర్స్ డే



పామర్రు: స్థానిక కొండిపర్రు రోడ్డులోని చైతన్య ఆగ్రో ఇండస్ట్రీ మిల్ ఆవరణలో పద్మశ్రీ ఘంటసాల కళాపీఠం వారి ఆధ్వర్యంలో ఫాదర్స్‌డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ మాట్లాడుతూ తండ్రి మనస్సు సముద్రం కన్నా విశాలమైనదన్నారు. హిమాలయ పర్వతాల కన్నా దృఢమైనదని, భగవంతునిచే అందించిన గొప్ప వ్యక్తి తండ్రిని కొనియాడారు. కుటుంబ బరువు బాధ్యతలను తమపై వేసుకుని కష్ట,నష్టాలను ఓర్చి కుటుంబాన్ని సాకే వాడే తండ్రి అని అన్నారు. అనంతరం కూనపరెడ్డి వెంకట ధర్మారావు, పాటిబండ రాంబాబులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జమీదగ్గుమిల్లి గ్రామ సర్పంచ్ కె.చంద్రశేఖర్‌రావు, కళాపీఠం సభ్యుడు తోట రమేష్, కనుమూరు మోడల్ స్కూల్ హెచ్‌ఎం నరేంద్ర మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ ధర్నా



గుడివాడటౌన్: కూటమి ప్రభుత్వం ప్రజలపై బలవంతంగా రుద్దుతున్న స్మార్ట్ మీటర్లు వద్దంటూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. స్థానిక నైజాంపేటలో ఈ మేరకు ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది వచ్చి మీటర్లు మారుస్తున్నారన్నారు. దీని వలన అనేక నష్టాలు వస్తాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని స్మార్ట్ మీటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, ఆర్సీపీ రెడ్డి, పి.రజిని పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుపై ప్రచారమేదీ?

సబ్సిడీలకు దూరంగా చిన్న, సన్నకారు రైతులు

గన్నవరం రూరల్: మండలంలో పండ్ల తోటల సాగుపై అవగాహన, ప్రచారం లేకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు ప్రభుత్వం కల్పించే సబ్సిడీలకు దూరమవుతున్నారనే విమర్శలున్నాయి. గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి పండ్ల తోటల సాగుతోపాటు వర్తించే సబ్సిడీలను రైతులకు తెలియజేయాలని పలువురు కోరుతున్నారు. మండలంలోని 21 గ్రామాల్లో ఉద్యానవన పంటలు సాగు అవుతున్నాయి. మామిడి, జామ, నిమ్మ, సపోటా, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి, ఆయిల్ పామ్, ఆపిల్ బేర్, మునగ, మల్లి, గులాబీ తోటలు రైతులు సాగు చేస్తున్నారు. అయితే ప్రభుత్వం ఈ పంటల సాగుకు ఇచ్చే ప్రోత్సాహకాలు తెలియకుండా సొంత ఖర్చులు పెట్టుకుని ఇబ్బందులు పడుతున్నారు.

నేలలు అనుకూలం

గన్నవరం మండలంలో 21 గ్రామాలు ఉండగా 15 మెట్ట భూములు ఉన్నాయి. ఎర్ర నేలలు ఉద్యానవన పంటలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఒకవైపు మెట్ట, మరోవైపు మాగాణి భూముల సమాహారం గన్నవరం మండలం. అందుకే ఇక్కడ వాణిజ్య పంటలు కూడా రైతులు సాగు చేస్తారు.

నీటి వసతికి ఇబ్బందులు లేవు

మాగాణి భూములు ఉన్న జక్కులనెక్కలం, కేసరపల్లి, అజ్జంపూడి, బుద్ధవరం, అల్లాపురం గ్రామాల్లో వరి అధికంగా పండిస్తారు. ఏలూరు కాలువ, బుడమేరు నీటితో పంటల సాగు జరుగుతోంది. ఇతర గ్రామాల్లో చెరువుల కింద, పోలవరం నీటితో పంటలు సాగవుతున్నాయి. చిన అవుటపల్లి ప్రాంతంలో ఆయిల్ పామ్, జామ, మామిడి, ఇతర ఆదాయాన్నిచ్చే పంటలు రైతాంగం సాగు చేస్తున్నారు. మండలంలో 17,500 ఎకరాల్లో ఏటా వరి సాగవుతోంది. దీంతో పాటు ఉద్యానవన పంటలు మరో ఆరు వేల ఎకరాల్లో సాగు జరుగుతున్నట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి.



వీరపనేనిగూడెంలో మామిడి తోట వేస్తున్న రైతులు

పండ్ల తోటలో వేసుకునే రైతులకు ప్రోత్సాహకం

గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉచితంగా పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తోంది. సన్న, చిన్నకారు రైతులు ఐదు ఎకరాల్లోపు భూమి కలిగిన వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాశాఖ అధికారులు తెలిపారు.

వివిధ పంటల సాగుకు ప్రోత్సాహకం ఇలా..

మామిడి ఎకరానికి రూ.1,09,950, జామ రూ.1,46,971, నిమ్మ రూ.1,46,311, సపోటా రూ.95,584, దానిమ్మ రూ.2,16,417 అదేవిధంగా ఇతర పంటలకు ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలను వేసుకునే రైతులను ప్రోత్సహించాలని అధికారులు పలు గ్రామాల్లో ఇప్పటికే కార్యాచరణ చేపట్టారు. అయితే విస్తృత ప్రచారం నోచుకోక రైతులు సొంత ఖర్చులతో పండ్ల తోటలు సాగు చేస్తున్నారు.

మొక్క నుంచి మూడు సంవత్సరాల వరకు ఊతం

మొక్కలు అందజేయటం, గుంత తవ్వించటం మూడు సంవత్సరాల వరకు నిర్వహణ, ఉపాధి పథకం రైతులకు చేదోడుగా ఉండి సహకారం అందిస్తోంది.

రైతులను భాగస్వాములను చేయాలి



పండ్ల తోటల సబ్సిడీలపై రైతాంగానికి విస్తృత అవగాహన కల్పించాలి. ఈ పథకాలు పేద రైతులకు చేరటం లేదు. డబ్బు ఉన్న రైతులు వినియోగించుకుంటున్నారు. సామాన్య రైతుకు మేలు జరగాలంటే ప్రభుత్వ శాఖలు ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి.

– మల్లంపల్లి అంజనేయులు, సీపీఎం మండల కార్యదర్శి, గన్నవరం

ప్రభుత్వ ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలి



పండ్ల తోటలు వేసుకునే రైతులు ప్రభుత్వం ప్రోత్సాహకాలను తీసుకోవాలి. ఉద్యాన పంటలు ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు లబ్ధి చేకూరుతుంది. వివరాలకు ఎంపీడీఓ, ఏపీఓ, సచివాలయం హార్టీకల్చర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించాలి.

– రాజు, ఇన్‌చార్జి ఏపీఓ, గన్నవరం

అన్నదాతలకు అందని ఆర్థిక సాయం



విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరుతో ఖరీఫ్ సీజన్ పెట్టుబడి సాయంగా అందజేసే ఆర్థిక సాయం ఇంకా రైతులకు అందలేదు. గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల వద్ద ప్రభుత్వం లబ్ధిదారుల వివరాలను రైతుసేవా కేంద్రాల వద్ద డిస్‌ప్లే చేసింది. ఆ జాబితాలో పేర్లున్న రైతులు ఈకేవైసీ చేయాలనే నిబంధనలు విధించడంతో రైతులు ఆధార్‌కార్డు, పొలం పట్టాదారు పుస్తకాల ప్రూఫ్‌లను తీసుకుని పరుగులు తీస్తున్నారు. ఈకేవైసీ చేసిన పిమ్మట బ్యాంక్ ఖాతాల్లో ఆర్థిక సాయం జమ జరుగుతుందని వ్యవసాయ శాఖ సిబ్బంది చెబుతున్నారు. అయితే గత ప్రభుత్వంలో రైతుభరోసా సాయం పొందిన వారిలో ఇంకా కొంత మంది పేర్లు జాబితాలో లేకపోవడంతో వారు సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో లబ్ధిదారుల జాబితా అందలేదని సిబ్బంది అంటున్నారు. కౌలు చేస్తున్న కౌలుదారులకు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం వర్తించకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారికి కూడా పెట్టుబడి సాయం కింద ఆర్థిక సాయం అందజేయాలని కోరుతున్నారు.

భక్తుల కోలాహలం

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయం భక్తజనంతో కోలాహలంగా మారింది. ఆదివారం కావడంతో తెలుగు ఉభయ రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది.

నత్తనడకన డ్రెయినేజీ పనులు



పెనమలూరు ప్రధాన రహదారిపై మట్టి గుట్టలు



రోడ్డుపై నిలిచిన మురుగునీరు

సిటీ బస్సుల రాకపోకలకు అంతరాయం

పెనమలూరు: పెమలూరులో డ్రెయినేజీ పనులు నత్తనడకన సాగుతుండటంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారిని తవ్వటంతో సిటీ బస్సులు నిలిచిపోయాయి. దీంతో గ్రామస్తులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. పైగా ప్రధాన రహదారి పైనే మురుగు నీరు నిలిచి పోవటంతో విద్యార్థులు, గ్రామస్తులు నడవలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. వివరాల్లోకి వెళితే పెనమలూరు ప్రధాన రహదారి పక్కన డ్రెయినేజీ పనులు చేపట్టారు. చాలా సంవత్సరాల తరువాత డ్రెయినేజీ పనులు చేపట్టడటంతో గ్రామంలో మురుగునీటి సమస్య తీరే అవకాశం ఏర్పడింది. అయితే ఈ పనులు నత్తనడకన సాగుతుండటంతో రోజువారీ పనులకు రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడుతున్నారు. అదేవిధంగా విద్యార్థులు కూడా తీవ్ర అసౌర్యానికి గురవుతున్నారు.

రోడ్డుకు అడ్డంగా మట్టి గుట్టలు

డ్రెయినేజీ నిర్మాణంలో భాగంగా పెనమలూరు–చోడవరం గ్రామాలకు ఉన్న ప్రధాన రహదారిని అడ్డంగా తవ్వారు. డ్రెయినేజీ పనులు చేపట్టారు. దాదాపు 15 రోజులుగా రోడ్డు మధ్యలో తవ్వి మట్టి గుట్టలు రోడ్డుకు అడ్డుగా వేయంటతో గ్రామంలో హైస్కూల్ వరుకు రావాల్సిన సిటీ బస్సుల రాకపోకలు నిలిపివేశారు. సిటీ బస్సులను పెద్ద గుడి వరకే తీసుకొచ్చి తిరిగి వెళ్లి పోతున్నారు. పైగా పెద్ద గుడి వద్ద ఆర్టీసీ బస్సులు ఆపటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. హైస్కూల్ సెంటర్ నుంచి బస్సులు ఎక్కాలంటే పెద్దగుడి వరకు నడిచి రావాల్సివస్తోంది. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు.

పనులు పూర్తిచేయాలి

హైస్కూల్ సెంటర్ వద్ద డ్రెయినేజీ పనులు వెంటనే పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. రోడ్డు పై గుంతలు అత్యంత ప్రమాదకంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిటీ బస్సులు హైస్కూల్ సెంటర్‌కు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే హైస్కూల్ వద్ద ప్రధాన రహదారిపై మురుగునీరు నిలవకుండా చర్యలు తీసుకుంటే రోడ్డుపై నడిచేందుకు అవకాశం ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు.

200 మందికి రక్త పరీక్షలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని వలందపాలెం రహమానియా(అహలె హదీస్) మసీదు వద్ద ఉన్న ఈద్గా స్థలంలో ఆదివారం ఉచిత రక్త పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. రహమానియా మసీదు, దివ్య ల్యాబ్ రక్త పరీక్ష కేంద్రాల సంయుక్త ఆధ్వర్యంలో 200 మందికి అన్ని రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా వలందపాలెం, మాచవరం, నీలగిరి, గంగులవారితోట, గాంధీనగర్, సర్కార్‌తోట, సుకర్లాబాద్, పరాసుపేట తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు రక్త పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో రెహమానియా మసీదు అధ్యక్షుడు మహమ్మద్ దాదాసాహెబ్, వైస్ ప్రెసిడెంట్ నాగుల్ మీరా, సెక్రటరీ ఎండీ ఆబు మహమ్మద్ సిద్ధిక్, దివ్య ల్యాబ్ నిర్వాహకులు రాంబాబు, సలీం అబ్దుల్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉర్వేళమ్మ జాతర

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న గ్రామ దేవత ఉర్వేళమ్మ జాతర మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పసుపు కుంకుమలు సమర్పించి పూజలు చేశారు. ఏపీఐఐసీ డైరెక్టర్ మండలి రాజేష్ కుటుంబ సమేతంగా పోతురాజుస్వామి చెట్టుకు పూజలు చేసి, ఆలయంలోని ఉర్వేళమ్మ తల్లిని దర్శించుకున్నారు. అమ్మవారికి చీర, పసుపు కుంకుమ సమర్పించారు. ఆలయ ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు, గ్రామ సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, ముఠా పెద్దలు ఆయనకు స్వాగతం పలికారు. గన్నవరం ఏఎంసీ చైర్మన్ గరికపాటి శివశంకర్ ఆయన వెంట ఉన్నారు.

ఆకతాయిలకు కేరాఫ్‌గా ఫుట్ బ్రిడ్జిలు

పట్టించుకోని పోలీసులు

కంకిపాడు: జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన ఫుట్‌బ్రిడ్జిలు అసాంఘిక శక్తులు, ఆకతాయిలకు కేరాఫ్‌గా తయారయ్యాయి. మందుబాబులు, గంజాయి తాగే వ్యక్తులతో పాటుగా అసాంఘిక చర్యలకు అలవాలం అయ్యాయి. పోలీసుల పర్యవేక్షణ కొరవడటంతో ఆకతాయిలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై ప్రధాన గ్రామాలు, కూడళ్ల వద్ద సురక్షిత ప్రయాణం సాగేందుకు వీలుగా ఫుట్‌బ్రిడ్జిలు నిర్మించారు. జాతీయ రహదారి విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా అందుబాటులోకి తెచ్చిన బ్రిడ్జిల మీదుగా పాదచారులు, ద్విచక్రవాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రధానంగా పెనమలూరు, కంకిపాడు ప్రాంతాల్లో పలు చోట్ల నిర్మించిన ఫుట్‌బ్రిడ్జిలు పోలీసు శాఖ పర్యవేక్షణ లోపం కారణంగా అసాంఘిక శక్తులకు అడ్డాగా మారాయి.

చెప్పనలవి కాని వైనం..

పగలూ, రాత్రీ తేడా లేకుండా ఈ ఫుట్ బ్రిడ్జిలపై అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అడ్డూ అదుపూ లేకుండా యువత మద్యం తాగుతూ రెచ్చిపోతున్నారు. మద్యం తాగే సమయంలో వచ్చే గొడవలతో బ్రిడ్జి మీదే సీసాలు పగలకొట్టి గొడవలకు పాల్పడుతున్న ఘటనలు అనేకం. మత్తుకు అలవాటైన యువత రాత్రిళ్లు ఈ బ్రిడ్జిలపై చేరి గంజాయి తాగుతున్నారనే ఆరోపణలున్నాయి. మరికొందరు జంటలు గా వచ్చి ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. బ్రిడ్జిలపై ఇటీవల బ్యానర్లు అధికంగా కడుతుండటంతో బ్రిడ్జిలపై ఎవరు ఉంటున్నారు? అనే విషయం కూడా తెలీకుండా పోవటం గమనార్హం.



ఈడుపుగల్లులో ఫుట్ బ్రిడ్జిపై ఉన్న మద్యం సీసాలు

పోలీసు చర్యలు ఏవీ?

నిత్యం గస్తీ కాస్తున్నామని చెప్పే పోలీసులు ఈ ఫుట్ బ్రిడ్జిలను పట్టించుకోవటం లేదు. బ్రిడ్జి మాటున అసాంఘిక కార్యకలాపాలు అడ్డగోలుగా సాగుతుంటే పర్యవేక్షణ ఎక్కడ? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. రాకపోకలకు వీలుగా, సురక్షిత గమ్యం చేరుకోవటానికి అనువుగా నిర్మించిన బ్రిడ్జిలు ఆకతాయిలకు నెలవుగా మారటంపై ప్రజలు విస్మయం చెందుతున్నారు. పోలీసులు స్పందించి ఆకతాయిల చర్యలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

‘దారి తప్పుతున్న కూటమి ఏడాది పాలన’ పుస్తకావిష్కరణ

మచిలీపట్నంటౌన్: స్థానిక కామ్రేడ్ మధుసూదన్ రావు శ్రామిక భవన్‌లో కూటమి ప్రభుత్వ ఏడాది పాలన, జిల్లా అభివృద్ధిపై సీపీఎం ముద్రించిన ‘దారి తప్పుతున్న కూటమి ఏడాది పాలన’ అనే పుస్తకాన్ని ఆదివారం సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల అమలులో ప్రభుత్వం నత్త నడక సాగిస్తూ ఒకటి రెండు హామీలు అమలు చేసి మిగతావి గాలికి వదిలేసిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడానికి ఏమో నిధులు లేవని, పెట్టుబడిదారులకు పారిశ్రామిక వాడల పేరుతో భూములు దోచిపెట్టడానికి నిధులు ఎక్కడ నుంచి వచ్చాయన్నారు. జిల్లా కేంద్రంగా ఉన్న మచిలీపట్నాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. 30 నెలల్లో పోర్ట్ నిర్మాణం పూర్తి చేసి ఐదు వేల ఎకరాలలో భూములు సేకరించి పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్నారు. ఆచరణలో పోర్టు నిర్మాణం నిదానంగా జరగడమే గాక పోర్టు ఆధారిత పరిశ్రమలు జాడ లేదని చెప్పారు. బందరు రూరల్ ప్రాంతాల్లో రెండు వేల మందికి పైగా ఉపాధి కల్పిస్తున్న భారత్ సాల్ట్ పరిశ్రమ మూత పడింది. ఉన్న పరిశ్రమలు మూత పడకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఆందోళనా కార్యక్రమాలను తీవ్రతరం చేస్తాం..

జ్యూవెలరీ పార్క్‌ను విస్తరించి శిక్షణ సంస్థ ఏర్పాటు చేసి నైపుణ్యాలను మెరుగుపరుస్తామన్న హామీ నెరవేరలేదని చెప్పారు. పెడన కలంకారి పరిశ్రమను ఆదుకునేందుకు చేనేత క్లస్టర్ జాడలేదన్నారు. మల్లవల్లి పారిశ్రామిక వాడలో విద్యుత్ తదితర మౌలిక సదుపాయాల కల్పన జరగలేదన్నారు. కీలకమైన సెంట్రల్ ప్రాసెసింగ్ యూనిట్ ఇంకా ప్రారంభించలేదని గుర్తుకు చేశారు. గుడివాడలో ప్రైవేట్ రంగంలో పరిశ్రమల ఏర్పాటు హామీలు అలానే ఉంది. కృష్ణ డెల్టా పంట కాలువలు, మేజర్ డ్రెయిన్‌ల అభివృద్ధి పనులు వర్షాలు ప్రారంభమయ్యాక మొదలుపెట్టి చేతులు దులుపుకున్నారని వివరించారు. కృష్ణా నదిపై ప్రకాశం బ్యారేజీ దిగువన చోడవరం, బండి కోళ్లలంక వద్ద డ్యాములు కడతామన్న హామీ మిగిలే ఉంది. మచిలీపట్నం- రేపల్లె రైలు మార్గం నిర్మాణం కాగితాల మీదే ఉందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని సీపీఎం కృష్ణ జిల్లా కమిటీ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. హామీలను అమలు చేయకుంటే రానున్న రోజుల్లో ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ఆందోళనా కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శీలం నారాయణ రావు, సీపీఎం మచిలీపట్నం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నరసింహారావు తదితరులు

కరాటే విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

పాయకాపురం(విజయవాడ రూరల్): క్యోఇకు కరాటే అకాడమీలో కరాటేలో శిక్షణ పొందిన విద్యార్థులకు ఆదివారం బెల్టు గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. క్యోఇకు కరాటే ఆకాడమీ ప్రధాన శిక్షకులు బల్లం కిషోర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఎల్లో బెల్ట్, ఆరంజ్ బెల్ట్, గ్రీన్ బెల్ట్, బ్లూ బెల్ట్ పర్పుల్ బెల్ట్ విభాగాల్లో ఉత్తమ ప్రదర్శన కనపరిచిన విద్యార్థులకు అప్ గ్రేడ్ బెల్ట్‌లు ప్రదానం చేశారు. అతిథులుగా శారదా స్కూల్ కన్వీనర్ పెనుమత్స అప్పలరాజు, వివేకానంద సెంటనరీ హైస్కూల్ హెచ్‌ఎం జి.హరిత మాధవిలత, మానస పాఠశాల ప్రిన్సిపాల్ పల్లెం జయప్రకాష్ శిక్షణలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బెల్టులు, మెమెంటో, సర్టిఫికెట్లు అందజేశారు.

గ్రామసభలు ప్రారంభం

మోపిదేవి: 2024- 25 ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల వివరాలను గ్రామసభలో చదివి వినిపించారు. మండలంలో ఉదయం బొబ్బర్లంక, కె.కొత్తపాలెం, వెంకటాపురం, కోసూరువారిపాలెంలో, సాయంత్రం మోపిదేవి, పెదప్రోలు గ్రామ సచివాలయాల వద్ద ఆయా గ్రామ సర్పంచ్‌ల అధ్యక్షతన ఆదివారం గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభల్లో గతేడాదిలో జరిగిన పనులను డీఆర్‌వో బృందాలు చేపట్టిన తనిఖీలలో వచ్చిన అభియోగాలు, సమస్యలను గ్రామ సభలో చదివి వినిపించారు. అనంతరం టీఏ హరిబాబు నాయక్ మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన ప్రజా వేదిక నిర్వహిస్తామన్నారు. ఎంపీపీ రావి దుర్గావాణి, గ్రామ సర్పంచ్‌లు దొప్పలపూడి గంగాభవాని, కొక్కిలిగడ్డ మాధవి, తుమ్మా సోములమ్మ, కోసూరు అనూష, నందిగం మేరీరాణి, పాలిమెట్ల ఏసుబాబు, ఎంపీటీసీలు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, మేట్‌లు, కూలీలు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న టీఏ హరిబాబు నాయక్

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టండి



పెడన: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలని, ఎక్కడ కూడా చెత్త నిల్వలు లేకుండా చూడాలని ఎంపీడీఓ ఎ.అరుణకుమారి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ మేరకు ఆమె ఆదివారం పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. వర్షాలు పడుతున్న తరుణంలో వర్షం నీరు నిల్వలేకుండా చూడాలని, తాగు నీటి బావుల వద్ద క్లోరినేషన్ పనులు చేపట్టాలని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేకునేలా చైతన్యం చేయాలని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని డయేరియా వంటివి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు పూర్తిగా పారిశుద్ధ్యంపై దృష్టిపెట్టాలని స్పష్టం చేశారు.

బహుముఖ ప్రతిభాశాలి మహాకవి శ్రీశ్రీ

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి మహాకవి శ్రీశ్రీ అని సినీ దర్శకుడు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని జీవీఆర్ కళాశాలలో ఆదివారం శ్రీశ్రీ 42 వర్ధంతి సభ, తమ్మారెడ్డి భరద్వాజకు మహాకవి శ్రీశ్రీ స్మారక పురస్కార సభను ఆదివారం నిర్వహించారు. పురస్కారం అందుకున్న భరద్వాజ మాట్లాడుతూ తెలుగు సినిమాపాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన కవి శ్రీశ్రీ అన్నారు. ప్రబోధాత్మక గీతాలైన, కరుణ రసాత్మకమైన గీతాలైన, విషాద గీతాలైన అద్భుతంగా రాయగల నేర్పు శ్రీశ్రీ దన్నారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ మహాకవి శ్రీశ్రీ కవిత్వం ఎందరో యువ కవలకు స్ఫూర్తిగా నిలిచిందని చెప్పారు. అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు పాటకు సాహిత్య విలువలను అందిచిన కవి శ్రీశ్రీ అన్నారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి సంస్థ లక్ష్యాలను వివరించారు.

వక్ఫ్ భూముల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



పెనమలూరు: తాడిగడప, పెదపులిపాక గ్రామాలలో ఉన్న కొండపల్లి ఖాజీ, వక్ఫ్ భూములను రాష్ట్ర, జిల్లా వక్ఫ్ అధికారులు ఆదివారం పరిశీలించారు. ఏపీ వక్ఫ్ బోర్డు సీఈఓ మహమ్మద్ ఆలీ, జిల్లా వక్ఫ్ బోర్డు అధికారి ఎండీ నాహరాఆలీషా, కొండపల్లి ఖాజీ సయ్యద్‌హబీబుల్లా హుస్సేనీ, వక్ఫ్ అధికారి ఎండీ కరీముల్లా కలిసి ఆ భూముల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. వక్ఫ్ భూములు ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోర్టు అనుమతులు రాగానే వేలం పాడిన రైతులకు 11 నెలలు కౌలు లీజుకు భూములు అప్పగిస్తామని వక్ఫ్ అధికారులు తెలిపారు.

వక్ఫ్ బోర్డుకు ఆదాయం

గత కొద్ది రోజుల క్రితం వక్ఫ్ భూములు దాదాపు 40 ఎకరాలను పెనమలూరు తహసీల్దార్ ఏక్‌సాల్‌లీజ్ కౌలు వేలం నిర్వహించారు. దీని ద్వారా వక్ఫ్‌కు రూ. 24,08,415 ఆదాయం సమకూరింది. గతంలో కొందరు టీడీపీ నేతలు వక్ఫ్ భూములను ఆక్రమించి నయాపైసా కౌలు ఇవ్వకుండా దాదాపు 40ఏళ్లు పంట సాగు చేసి సొమ్ము బొక్కేశారు. ఇది దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో వక్ఫ్ భూములు ఆక్రమణలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టారు.